
నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 26 జనవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

### పోలీసులతో బెదిరిస్తుండ్రు..



గుట్టపైకి మూగజీవాలను పశుగ్రాసం కోసం తీసుకెళ్తే మైనింగ్ మాఫియా వాళ్లు బెదిరిస్తున్నారు. పోలీసులతో కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉమ్మడి అనంతవరం జీపీ ఉన్నప్పుడు మైనింగ్ జరిపేది లేదని తీర్మానం చేశారు. ఓట్లప్పుడు మాత్రమే నాయకులకు మేం గుర్తుకొస్తాము. సమస్యల్లో ఉన్నప్పుడూ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మైనింగ్ పనులను నిలిపివేయాలి.

– గుడెల్లి రాములు, మైలారం

### కావాలనే పనులను చేయిస్తుండ్రు..



అనంతవరం ఉమ్మడి గ్రామ పంచాయతీ ఉన్నప్పుడే అప్పటి సర్పంచ్, ఎంపీటీసీ, జీపీ సభ్యులు మైనింగ్ సిబ్బందితో రూ.లక్షలు తీసుకొని అనుమతులు ఇచ్చారు. మైనింగ్ పనుల కారణంగా మూగజీవాలు మృత్యు వాతపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పైసల కోసం కక్కుర్తిపడి ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచి కావాలని పనులను చేయిస్తున్నారు. ప్రశ్నిస్తే మాపై కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– లక్ష్మయ్య, అనంతవరం



కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

## ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 25 : దేశంలోని ప్రైవేట్ రంగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సౌత్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం బెంగళూర్‌లోని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి జేడీ కుమారస్వామిని దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘాల నేతలు బాలరాజు, శివకుమార్, ఓంకార్, గోపిగౌడ్‌తో కలిసి మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా వంటి రాష్ట్రాలకు నిధులు కేటాయించి పరిశ్రమలు నెలకొల్పాలని పేర్కొన్నారు. జేడీఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్ణాటకలో నీరా పాలసీని రూపకల్పన చేయాలన్నారు.



బల్మూరు మండలంలోని మైలారం గ్రామం, అనుసరించి ఉన్న పలుగురాళ్ల గుట్ట

- బల్మూరు మండలం మైలారం గుట్టపై జోరుగా మైనింగ్ తవ్వకాలు
- బెంబేలెత్తుతున్న పల్లెవాసులు
- ఊరికి ముప్పంటూ ఆందోళన
- రిలే నిరాహార దీక్షలకు సిద్ధమైనా ముందస్తు అరెస్టులు
- ఏళ్లుగా గ్రామస్తుల గోస పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

# పలుగురాళ్ల గుట్టలో.. ప్రకంపనలు

*మైలారం పలుగురాళ్లగుట్టపై మైనింగ్ మాఫియా ప్రకంపనలు సృష్టిస్తున్నది. నల్లమలను అనుసరించి ఉన్న ఆ గ్రామానికి గనులు శాపంగా మారాయి. పల్లెకు సమీపంలో ఉన్న గుట్టపై క్వార్ట్జ కోసం జరుగుతున్న తవ్వకాలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. గుట్టను స్వాహా చేసేందుకు నిరంతరం తవ్వకాలు జరుపుతుండడంతో ఆందోళన బాట పట్టారు. అయినా వారి గోడును పట్టించుకోకుండా పనులు చేస్తుండడంతో ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నాయి. తమ ప్రాణాలు పోయినా సరే మైనింగ్‌కు ఒప్పుకోమని తెగేసి చెబుతున్నారు. అయినా వినకపోవడంతో ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు.*

*– అచ్చంపేట/బల్మూర్, జనవరి 25*

నల్లమలలో మైనింగ్ మాఫియా విధ్వంసం సృష్టిస్తున్నది. అడవిని నమ్ముకొని స్వేచ్ఛగా పశుపక్షాదులతో మమేకమై జీవనం సాగిస్తున్న పల్లెవాసులకు కంటిపై కునుకులేకుండా చేస్తున్నది. ఇంతకాలం పల్లెను నమ్ముకొని బతుకున్న జనం నెత్తిన మైనింగ్ కార్పొరేట్ కత్తి వేలాడుతోంది. నల్లమల అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతానికి ఆనుకొని రెండు కిలోమీటర్ల దూరంలోని బల్మూర్ మండలం మైలారం పలుగురాళ్లగుట్ట ఉన్నది. ఈ గుట్టను మైనింగ్ మాఫియా కండ్లముందే ధ్వంసం చేస్తుంటే ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.

**కార్పొరేట్ శక్తులకు బలైతున్న గుట్ట**

మైలారం గ్రామానికి అడవి 50మీటర్ల దూరంలోనే ఉంటుంది. గుట్టకింద పేదలు ఇండ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్నారు. 115ఎకరాల్లో గుట్ట విస్తరించి ఉంటుంది. గుట్టపై పురాతన లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం, శివాలయం, గ్రామ దేవతల ఆలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇటీవల గుట్టపై ప్రభుత్వ నిధులతో పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. గుట్టను ఆధారంగా చేసుకొని మైలారం, కొండనాగుల, బల్మూర్ గ్రామాల రైతులు, పశువుల కాపరులు తమ జీవాలను మేపుకొంటారు. గుట్టకింద ఊరు అంచునా చెరువు ఉంది. చెరువును నమ్ముకొని కొండనాగుల, మైలారం, బల్మూర్ గ్రామాలకు చెందిన 2వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతున్నది. చెరువు వల్ల భూగర్భజలాలు పెరిగి బోర్లు నడుస్తున్నాయి. చెరువుకు ఆనుకొని ఉన్న మైలారం గుట్టను రక్షణగా ఉమామహేశ్వరం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం టెండర్ కూడా పూర్తి చేసింది. రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ పనిలో అధికారులు ఉన్నారు. మైనింగ్ వల్ల రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందా? లేదా అనేది ప్రజలకు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కండ్లముందే గుట్ట కార్పొరేట్ శక్తులకు బలైపోతుంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఆగని మైనింగ్ పనులు**

తమ గుట్టను కాపాడుకునేందుకు మైలారం గ్రామస్తులు మొదటి నుంచి మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకంగా అందోళనలు చేపట్టారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. పార్లమెంట్ ఎన్నికలను కూడా బహిష్కరించారు. అధికారులు వెళ్లి గ్రామస్తులకు నచ్చజెప్పి పోలింగ్ జరిగేవిధంగా చూసినా గ్రామస్తులు పెద్దగా పోలింగ్‌లో పాల్గొనలేదు. గతంలో అనేకసార్లు గ్రామస్తులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు పెట్టి ఆందోళనలు చేపట్టారు. ఆందోళన, పనులు అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతియుతంగా రిలేదీక్షలు చేపట్టేందుకు పూనుకున్న గ్రామస్తులను పోలీసులు గ్రామంలోకి వచ్చి కొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో గ్రామం అంతా కదిలి వారం కింద ఆందోళన చేపట్టారు. ముళ్లకంచెలు పెట్టి పోలీసులు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఇలా గ్రామస్తులు ఎప్పటికప్పుడు మైనింగ్‌ను వ్యతిరేకించి గుట్టను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వాలు ప్రజల బాధను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీకి వత్తాసు పలకడంతో గ్రామస్తులు ప్రభుత్వాలపై భగ్గుమంటున్నారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులు, ప్రభుత్వాలు వారిని వదిలేసి పోలీస్ పహారా మధ్య మైనింగ్ పనులు కొనసాగించడంపై ప్రజలు జీర్ణించుకోవడం లేదు. గుట్టపైకి గ్రామస్తులు, మీడియా ఎవరినీ అనుమతించడం లేదు. పశులు, మేకలను మేప నివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవిలోకి పశువులు, జీవాలను మేపేందుకు తీసుకెళ్తే ఫారెస్టు అధికారులు కేసులు పెడుతున్నారు. గుట్టపైకి తీసుకెళ్తే మైనింగ్ మాఫియా రానివ్వడం లేదని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

**20ఏండ్ల పాటు కంపెనీకి అనుమతి**

మైలారం గుట్టను 20ఏండ్ల పాటు కంపెనీకి మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చింది. సర్వే నెంబర్ 120/1లో 24.28హెక్టార్లు మైనింగ్ కంపెనీకి మైనింగ్ శాఖ 2018లో అనుమతి ఇచ్చింది. 2018 లో గ్రామస్తులు మైనింగ్ అనుమతులపై అభ్యంతరాలపై నివేదిక పంపించారు. ఫోర్జరీ సంతకాలతో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి అనుమతి పొందారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైనింగ్‌తో చెరువు, అటవీ, పర్యావరణానికి ఎటువంటి ఇబ్బంది లేదని మైనింగ్‌శాఖ అనుమతినిచ్చింది. అయితే గ్రామసభ ఆమోదం లేకుండా ఫోర్జరీ సంతకాలతో చేసిన తీర్మానంపై గ్రామస్తులు అనేకసార్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కంపెనీ మిషన్లు వచ్చినా తిప్పి పంపించారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ లీజుదారు గుట్టపై ఉన్న భారీ చెట్లను తొలగించి రోడ్లు వేసుకోవడం, పనులు చేపట్టడం ప్రారంభించారు. గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఈ ప్రభుత్వ పెద్దలు చెప్పడం, గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పనులు ప్రారంభంకావడం, ఈ ప్రభుత్వం మైనింగ్‌ను సీరియస్‌గా తీసుకోకపోవడంపై



మైలారంలో రోడ్డుపై స్థానికుల రాస్తారోకో(ఫైల్)

స్థానికులు అనేక అనుమానాలు వ్యక్తం చేశా రు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటే లీజు రద్దు చేసే అవకాశాలు లేవా?అనే ప్రశ్నలు ఉత్పన్న మవుత్తున్నాయి. దీనిపై హైకోర్టులో కూడా ఫిర్యాదు చేశారు. ప్రజలు ఇన్ని ఆందోళనలు చేస్తున్నా గుట్టపై తవ్వకాల పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి.

### ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి..



2014 నుంచి 2018లో ఉమ్మడి అనంతవరం గ్రామపంచాయతీ పాలక సభ్యులు, సర్పంచు తీర్మానం చేశారు. అప్పటి ఎమ్మెల్యే గువ్వలతో మాట్లాడి అనుమతులు రాకుండా నిలిపివేశాం. మైనింగ్ సిబ్బంది పనులను చేస్తే గ్రామంలో రోడ్లు, ఆలయలు, మినరల్ వాటర్ అన్నివిధాలా గ్రామానికి అభివృద్ధి చేస్తామన్నారు. మైనింగ్ ద్వారా విషవాయువులు వెలువడి అనారోగ్య సమస్యలు, మూగజీవాలకు ఇబ్బందులు వస్తాయని చెప్పాం. మైనింగ్ నిలిపివేయాలని నిరసన, ర్యాలీలు చేయడంతో అప్పటి ఎమ్మెల్యే గువ్వల మైనింగ్ పనులను నిలిపివేయించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను నిలిపివేయాలి.

– గుండాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ అధ్యక్షుడు

## ఘనంగా ఓటరు దినోత్సవం



గద్వాలలో జెండా ఊపిఓటరు దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

**15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులు పాల్గొని ప్ల కార్డులు ప్రదర్శించారు. 'ఓటు మన హక్కు-ఓటు ఈజ్ యువర్ వాయిస్' వంటి నినాదాలు హోరెత్తించారు.**

## ముగిసిన న్యాక్ బృందం పర్యటన



పీయూ వీసీ శ్రీనివాస్‌కు మూడు రోజుల పర్యటన వివరాలు అందజేస్తున్న న్యాక్ కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 25 : పాలమూరు యూనివర్సిటీలో మూడురోజుల న్యాక్ టీం పర్యటన శనివారంతో ముగిసింది. ఈటీం పీయూ క్యాంపస్‌తోపాటు యూనివర్సిటీ పీజీ కళాశాల, ఫార్మసీ కాలేజ్, కాలేజ్‌ఆఫ్ ఎడ్యుకేషన్‌తో పాటు పీయూ పరిధిలో ఉన్న వనపర్తి, కొల్లాపూర్, గద్వాల పీజీ సెంటర్లలో పర్యటించింది. ఈ సందర్భంగా పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిట్ మీటింగ్‌లో న్యాక్ చైర్మన్ రమాశంకర్ దుబే మాట్లాడుతూ వర్సిటీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. కమిటీ మూడురోజుల పర్యటన వివరాలను రిపోర్టు రూపంలో సిద్ధం చేసి వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌కు అందజేశారు. అనంతరం పీయూ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఐదేండ్లలో తెలంగాణలో పాలమూరు వర్సిటీని అగ్రగామిగా నిలుపుతామని, మంచి గ్రేడ్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ న్యాక్ కమిటీ తేదీలు ప్రకటించిన తర్వాత తక్కువ సమయంలోఅన్ని ఏర్పాట్లు చేసిన బోధన, బోధనేతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా హాస్టళ్లలో ఉన్న సిబ్బంది సంక్రాంతి సెలవులను కూడా త్యాగం చేసి పనిచేశారని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆశుతోష్ కుమార్, అన్నస్వామి నారాయణమూర్తి, అగర్వాల్, మల్లైదాసు, జయశ్రీ, పీయూ పీఆర్వో రవికుమార్, ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నాగర్‌కర్నూల్, జనవరి 25 : విద్యార్థినిపైకి చెప్పు విసిరిన నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం కొండనాగుల జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని డీఈవో రమేశ్‌కుమార్ శనివారం సస్పెన్షన్ చేశారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చెప్పుపై విసిరిన ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినిపై చెప్పు విసిరిన ఘటన వివిధ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో ఘటనపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఫోన్‌ద్వారా ఆదేశాలు జారీ చేశారు. దీంతో బల్మూర్ ఎంఈవో నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని విధుల నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

## ఆర్డీఎస్ షట్టర్ల గేర్‌లాక్స్ చోరీ



29వ డిస్ట్రిబ్యూటరీకి ఏర్పాటు చేసిన లాక్‌లను దొంగిలించిన దృశ్యం

మానవపాడు, జనవరి 25 : ఆర్డీఎస్ కెనాల్ ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన షట్టర్ లాక్స్ రాడ్లను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఆర్డీఎస్ కాల్వకు కొన్నిరోజులుగా నీటి సరఫరా జరగలేదు. రైతులకు సాగునీరు అందించాలని ఉద్దేశ్యంతో మూడురోజులుగా వారబంధిగా నీటి సరఫరా పునరుద్ధరించారు. శుక్రవారం రాత్రి నుంచి 29వ డిస్ట్రిబ్యూటరీకి నీటి సరఫరా నిలిపివేసి 30వ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేశారు. అయితే ఈ క్రమంలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు 29, 30వ డిస్ట్రిబ్యూటరీలకు చెందిన గేర్ లాక్స్, రాడ్లను చోరీ చేశారన్నారు. దీనిపై మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈఈ తెలిపారు.

## అంతర్ జిల్లాల క్రికెట్ ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 25: జిల్లా కేంద్రంలోని క్రిష్టియన్‌పల్లి బ్రదర్‌హుడ్ క్రికెట్ అకాడమీలో శనివారం టీడీసీఏ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా టీడీసీఏ జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 31వరకు హైదరాబాద్ దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో జరిగే అండర్-17 టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.



అండర్-17 పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

## గణమైన వేడుకలకు సిద్ధం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు
- విద్యుద్దీప కాంతుల్లో ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు



